క్లుప్తంగా

వెండి తమలపాకుల హారం వితరణ



నంద్యాల(వ్యవసాయం): పట్టణ శివారులోని బైటిపేటలో వెలసిన శ్రీజంబులాపరమేశ్వరి అమ్మ వారికి గురువారం టెక్కె ప్రాంతానికి చెందిన చిలకల మల్లికార్జున, సుజాత దంపతులు 54 తమలపాకుల వెండి హారాన్ని విరాళంగా అందజేశారు. 65.500 గ్రాములతో దీనిని తయారు చేయించారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు గాండ్ల జగన్‌మోహన్ దాతకు సత్కరించారు.

దస్తగిరిస్వామికి ప్రత్యేక ఫాతెహాలు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజు వేముల, డబ్ల్యూగోవిందిన్నె గ్రామాల్లో గురువారం దస్తగిరి స్వామి గ్యార్మీ పండుగను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. జెండాలతో గ్రామస్తులు పురవీధుల్లో తిరిగి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు కులమతాలకు అతీతంగా భోజనాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

రుద్రవరం: స్థానిక జెడ్పీఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం సుబ్బరాయుడు ఎస్‌ఐ వరప్రసాదు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యువత నడవడిక, సైబర్ నేరాలపై పోటీలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

శిరివెళ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఈఓ ఆర్డీ శ్రీనివాసశర్మ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య చర్యల ఫొటోలను విధిగా పీఆర్‌వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి నెల 2, 17 తేదీల్లో రక్షిత మంచి నీటి పథకాలను క్లోరినేషన్ చేయాలని, నెలలో ఒక సారి దోమల నివారణకు ఫా గింగ్ చేయించాలన్నారు. పైప్‌లైన్లు లీకేజీ కా కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి కార్యదర్శి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తమ తమ సచివాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఉయ్యాలవాడ ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు



ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఈయన నంద్యాల సీసీఎస్ నుంచిఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులురెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రఫీలను నంద్యాల ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరిరాముడు తెలిపారు.

జిల్లా కేంద్రంలో నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా ఫ్యాప్టో చైర్మన్ మాధవస్వామి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివయ్య రామచంద్రారెడ్డి, సుబ్బన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రానికి దాదాపు 200 కిలో మీటర్ల దూరంలో ఉన్న హిందూపురంలో ఏర్పాటు చేయడం ఉపాధ్యాయులకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు మౌలాలి, గోపాలకృష్ణ, సాంబశివుడు, షఫీవుల్లా, శ్రీనివాసులు, దస్తగిరి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు అందించాలి

నంద్యాల(న్యూటౌన్): డీబీటీ విధానంలో కాకుండా ఉచితంగా గ్యాస్ సిలిండర్ అందజేయాలని సీపీఎం పట్టణకార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్‌చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను సర్కారు విస్మరిస్తుందన్నారు. నంద్యాల జిల్లాలో 5.77 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. వినియోగదారులు డబ్బులు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే రెండురోజుల తర్వాత జమ చేస్తామని చెప్పడం సరికాదన్నారు.

అయోడిన్ లోపంతో అనర్థాలు

నంద్యాల(సిటీ): మనిషి శరీరంలో అయోడిన్ లోపిస్తే అనేక అనర్థాలు తలెత్తుతాయని నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసిం వలి అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక నూనెపల్లెలోని సత్య సమీక్ష కేంద్రంలో వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్, చిన్నారుల్లో బుద్ధి మాంద్యం, గర్భిణులకు పుట్టబోయే శిశువుల్లో ఎదుగుదల సరిగా ఉండదన్నారు. అందుకే వ్యాపారులు అయోడిన్ కలిగిన ఉప్పునే పట్టణ ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో రిటైల్ మర్చంట్ అధ్యక్షుడు రజనీకాంత్, ఉప్పు ట్రేడర్లు రవికుమార్, విజయ్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సభల్లో రెవెన్యూ అధికారులు



చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

రుద్రవరం/శిరివెళ్ల /దొర్నిపాడు:రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. గురువారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రెవెన్యూ సభలు నిర్వహించి భూ సమస్యలున్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రుద్రవరం మండల పరిధిలోని కోట కొండలో సర్పంచు డేగాని వెంకటేష్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో తహసీల్దారు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కార్యాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేకుండా ఊర్లలోనే సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పొలాలకు సంబంధించిన సమస్యలపై 88 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో డి ప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య, వీఆర్వోలు ఓబయ్య, అంకాలు, సర్వేయర్లు చంద్ర,రమణ,సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

● శిరివెళ్ల మండలం వనికినిదిన్నెలో జరిగిన సభలో తహసీల్దార్ పుష్పకుమారి పాల్గొని మాట్లాడారు. సభలో ఉమ్మడి ఖాతాలు, కొలతలు భూ విస్తీర్ణ వ్యత్యాసాలపై 44 మంది రైతులు అర్జీలు పెట్టుకున్నారు. కార్యక్రమంలో రీ- సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్‌ఐ సుచరిత, సర్వేయర్ చిన్న మల్లయ్య పాల్గొన్నారు.

● దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు భూములను సవరించాలని కోరుతూ 17 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. కార్యక్రమంలో డీటీ మాధవ, మండల సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్‌ఓలు షమిమూన్, సర్వేయర్లు సునీల్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

ఉయ్యాలవాడ : భూ సర్వే కొలతల్లో ఏమైనా తేడాలుంటే పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. కాకరవాడ గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఊరిలో 678 మంది రైతులకు సంబంధించి 3,332.99 ఎకరాల్లో భూ సర్వే పూర్తి చేశామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

గోస్పాడు: ఎం.చింతకుంట్ల గ్రా మంలో గురువారం నిర్వహించిన గ్రామ సభకు 151 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు.

పకడ్బందీగా గ్రామ సభలు

చాగలమర్రి: నంద్యాల రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ రీ సర్వే గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించాలని నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించిన సమస్యలుంటే రాతపూర్వకంగా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డీటీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): చాబోలు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభ రైతులు లేక వెలవెలబోయింది. గ్రామ సర్పంచ్ మౌనిక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతుల నుంచి 48 అర్జీలను స్వీకరించారు. అంతకు ముందు తహసీల్దార్ ప్రియదర్శిని మాట్లాడుతూ భూముల రీ సర్వేలో రిజిస్టర్ కాని భూములను డివిజన్ల వారీగా విభజించి పరిష్కరిస్తామని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు హ్యాండ్‌బాల్ అండర్-14 విభాగంలో నాగసుధ, సాయి, అండర్ 17 విభాగంలో సౌజన్య జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. అక్టోబర్ 1న కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్ నంద్యాలలో జరిగిన క్రీడల్లో విజయం సాధించినట్లు చెప్పారు. ఈనెల 26నుంచి 28వ వరకు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర, విద్యార్థులను అభినందించి రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం చెన్నయ్య, రమణయ్య, చంద్రశేఖర్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఏపీఓలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాలు, గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేబర్ మొబిలైజేషన్‌లో దొర్నిపాడు, మిడుతూరు, జూపాడుబంగ్లా, బేతంచెర్ల, నందికొట్కూరు మండలాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయన్నారు. ఆయా మండలాల అధికారులు శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌కు వచ్చి కలవాలన్నారు. పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్లకు వర్క్ ఐడీ వారీగా పెండింగ్‌లో ఉన్న టెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలానికి 1000 చొప్పున 28 మండలాలకు 28 వేల ఫాంపాండ్స్ నిర్మాణాలకు గాను 308 మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అన్ని మండలాలు ఫాంపాండ్స్ నిర్మాణాలకు ఎస్టిమేట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తే పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేస్తామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఈ వారం 138 గృహాలు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ, డీఈలకు ఆదేశించారు. గతవారం నిర్దేశించిన లక్ష్యంలో 40 గృహాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వందరోజుల ప్రణాళిక లక్ష్యాన్ని అధిగమించేందుకు పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలన్నీ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ సర్వే కింద పెండింగ్‌లో ఉన్న 1526గృహాల సర్వేను 26వ తేదీలోగా 100 శాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్ రావు, హౌసింగ్ ఈఈ హరిహర గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలోని గోల్డెన్ ఫంక్షన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 113 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పేరెడ్డి మోహన్ రెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, చిట్టెపు రాజగోపాల్‌రెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శం



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(న్యూటౌన్): మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. గురువారం నవభారత్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సీరత్ క్విజ్ -2024 పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రవక్త చరిత్ర తెలియజేసేందుకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆల్ ఫుర్ఖానా మదరసా పాఠశాల విద్యార్థి హుసేన్‌బాషా మొదటి బహుమతిగా రూ.10వేలు, నేషనల్ హైస్కూల్ విద్యార్థి అస్లాం రెండవ బహుమతిగా రూ.5వేలు, రోటరీ స్కూల్ విద్యార్థి నిఖిల్ మూడవ బహుమతిగా రూ.3వేలు అందుకున్నారు. 21మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, జమాన్, ఖాజీ, ఇసాక్, వాహీద్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మహాసభ పోస్టర్ విడుదల

నంద్యాల(న్యూటౌన్): పీడీఎస్‌యూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నంద్యాలలో ఆ సంఘం మహాసభ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీన జిల్లా కేంద్రంలోని నేషనల్‌పీజీ కళాశాలలో మహాసభ జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షాహీద్, ధను, సుధీర్, చందు, విజయ్‌కిరణ్, వంశీ, హరి, తదితరులు పాల్గొన్నారు.

3న వక్ఫ్‌పరిరక్షణ మహాసభలు

నంద్యాల(వ్యవసాయం): వచ్చే నెల 3వ తేదీన విజయవాడలో వక్ఫ్ పరిరక్షణ మహా సభలు నిర్వహిస్తున్నట్లు జమాతే ఇస్లామి హింద్ శాఖ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం స్థానిక కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. వక్ఫ్ చట్టాల సవరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్, నాయకులు జక్రియ, మౌలానా అబ్దుల్ సలాం, మహబూబ్‌బాషా, అర్షద్, అన్సార్, అబ్దుల్ హలీమ్, జైనుల్లా, మహమ్మద్ రఫీ, అబ్బాస్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు హామీని వెంటనే అమలు చేయాలి



పోస్టు కార్డులు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

నంద్యాల(అర్బన్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ స్థానిక నూనెపల్లె జంక్షన్‌లో ఆర్టీసీ బస్సులోని మహిళలతో ప్రయాణం చేస్తూ పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఉచిత బస్సు, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహాలక్ష్మి పథకం కింద రూ.1500 ఆర్థిక సాయం ఇలా పలు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. నాలుగు మాసాలు అవుతున్నా హామీలను అమలు చేయలేదన్నారు. ఈ విషయం గుర్తు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చింతలయ్య, మహిళా నాయకురాలు జయలక్ష్మి, హుసేన్‌బాషా, ఇస్మాయిల్, ఇబ్రహీం, పుల్లయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 26 నుంచి పట్టణంలో 37వ రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా భారతి రాయలసీమ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షుడు కృష్ణదేవరాయులు, యోగా గురువులు దామోదర్‌రెడ్డి, సెక్రటరీ నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. గురువారం యోగాసన పోటీల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యోగా శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు.

బెల్ట్ షాపులను అనుమతించొద్దు

గోస్పాడు: మండల పరిధిలో బెల్ట్ షాపులను అనుమతించరాదని సీపీఐ మండల నాయకులు జిలానీ బాషా, హరినాథ్ కోరారు. ఈ మేరకు వారు ఎస్‌ఐ వెంకటప్రసాద్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కొత్తగా మంజూరు అయిన వైన్‌షాపులు కూడా రహదారి పక్కనే ఉండటంతో ప్రజలు,విద్యార్థులకు ఇబ్బందిపడుతున్నారన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి కృషి

నంద్యాల(వ్యవసాయం):గంగపుత్రుల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు పుట్టా శివ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా బెస్త, తెలుగు, గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం ప్రథమ నందీశ్వర దేవస్థానం వైఎస్సార్ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

చాగలమర్రి: ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయాయని, దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రం చాగలమర్రిలోని ఎస్‌వీ జూనియర్ కళాశాలలో ''సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర'' అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి విశ్రాంత ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు రామకృష్ణ భగవాన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు.గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ఎవరైన అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు ఆధార్ కార్డు, ఏటీఎం పిన్ నంబర్లను అడిగితే ఇవ్వరాదన్నారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఇళ్లవద్ద తల్లిదండ్రులకు సైబర్ నేరాల గురించి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(సిటీ): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు సైబర్ నేరాలు- నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తాలూకా ఇన్‌స్పెక్టర్ గంగయ్య యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన పోటీలను ఆయన పరిశీలించారు ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా చైతన్యం చేయాలన్నారు.

అవి-ఇవి

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

చాగలమర్రి: 44వ జాతీయ రహదారి నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చాగలమర్రి, మల్లెవేముల గ్రామాల్లో రైతులు కోల్పోతున్న 23 ఎకరాలను గురువారం ఆయన పరిశీలించారు. మల్లెవేముల గ్రామంలో రైతులు మల్లారెడ్డి, పక్కర్దీన్, నరసింహారెడ్డి, విఘ్నేశ్వరరెడ్డి తదితరులతో ఆయన చర్చించారు. విలువైన సాగు భూములు కోల్పోతున్నామని తమకు మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వ నష్టపరిహారం అందజేయాలని ఆర్‌డీఓను కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రవికుమార్, హైవే డీటీ మంజూ, జేఈ సురేంద్రనాథ్ రెడ్డి, వీఆర్‌ఓలు ప్రసాద్, ఇమాంబాషా, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, సర్వేయర్లు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు కుట్ర

నంద్యాల(న్యూటౌన్): విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీన చలో విశాఖపట్నం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ధనుంజయుడు, రఫీ, శివ, ఎంఆర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు.సమావేశంలో సూర్యకుమార్, సతీష్, రాజా, హర్ష, సురేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని బాలబాలికలకు ఇండోర్‌స్టేడియంలో అండర్-17, 14 విభాగాల్లో కబడ్డీ , బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి 1000 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరికి దివంగత మాజీ ఎంపీ ఎస్పీవైరెడ్డి కుమార్తె నందిగ్రూప్ ఆఫ్ ఎండీ సుజల మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ స్కూల్ అధినేత సుధాకర్, జిల్లా ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ప్రభాకర్, రవికుమార్, సుంకన్నతో పాటు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి అరుదైన అవకాశం


నంద్యాల(రూరల్): యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ (యూఎన్‌జీఏ) 79వ సమావేశాలు అమెరికాలోని న్యూయార్క్‌లో నవంబర్ 18 నుంచి 22 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాలకు మన దేశం నుంచి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరుకానున్నారు. ఈ అరుదైన అవకాశం కల్పించిన భారత ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎంపీ శబరి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

రుద్రవరం: విధుల పట్ల అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. ఎల్లావత్తుల,శ్రీరంగాపురం గ్రామ సచివాలయాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో జరిగి అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం,తాగు నీరు తదితర అంశాలపై ఆరా తీశారు. క్రమం తప్పకుండా తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి పాములేటి ఉన్నారు.

బడి..సౌకర్యాలు కొరవడి

- గోస్పాడు ఉన్నత పాఠశాలలో సమస్యల తిష్ట
- అసౌకర్యాలతో విద్యార్థులకు అవస్థలు
- మంచినీరు లేక కుళాయి నీటిని తాగుతున్న అభ్యాసకులు
- మైదానంలో నిలిచిన నీరు
- పెరిగిపోయిన పిచ్చిమొక్కలు



క్యారియర్లు తెచ్చుకొని భోజనాలు చేస్తున్న విద్యార్థినులు



సక్రమంగా లేని బాత్‌రూములు



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు, పెరిగిన పిచ్చిమొక్కలు

గోస్పాడు: ఐదేళ్లపాటు సకల సౌకర్యాలతో అలరారిన విద్యాలయాలు నేడు కనీసం తాగునీరు, బాత్‌రూం వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ పట్టకపోవడం, పాలకులకు సమస్యలు కనిపించకపోవడంతో అభ్యాసకులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. స్థానిక హైస్కూలులో 410 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణం లోతట్టుగా ఉండటం, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక ఆవరణలో నిలిచిపోతుండటంతో బురద మయంగా మారింది. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నడవడానికి కూడా ఆటంకంగా మారాయి. మంచినీరు లేక చేతులు కడిగే కుళాయిల వద్ద నీటిని తాగుతున్నారు. బాత్రూం సక్రమంగా లేక విద్యార్థినులు తమ బాధను చెప్పుకోలేకపోతున్నారు.

క్రీడామైదానం.. బురదమయం..

చిన్నపాటి వర్షపు జల్లులు కురిసినా పాఠశాల మైదానంలో వర్షపు నీరు నిలుస్తుంది. దీంతో మైదనం గుంతలమయమై.. నీరు నిలిచి ఆటలాడేందుకు వీలుకాని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. సమస్య ఏంతో కాలం నుంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇక పాఠశాల ఆవణమంతా పిచ్చిమొక్కలు పెరిగి క్రీడామైదానం కాస్తా.. గడ్డి మైదానంగా మారింది. పిచ్చి మొక్కల్లో విషపురుగులు సంచరిస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

దాహార్తికి బోరునీరే శరణ్యం

పాఠశాలలో విద్యార్థులు తాగేందుకు మంచినీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే గత రెండు నెలలుగా మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీంతో అప్పటినుంచి పాఠశాల ఆవరణలో ఉన్న బోరు నుంచి సరఫరాచేసి కుళాయిల ద్వారా వచ్చే నీటిని విద్యార్థులు తాగాల్సి వస్తోంది. మధ్యాహ్న బోజన సమయంలో మంచినీటి కోసం చిన్నారులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం సరిగా లేకపోతుండటంతో కొందరు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని తింటున్నారు. మంచినీరు లేకపోవడంతో బాటిళ్లతో తెచ్చుకుంటున్నారు. ఆ వాటర్ అయిపోతే హ్యాండ్ వాష్ చేసుకునే కుళాయిల వద్ద నీటిని తాగుతున్నారు.

బాత్‌రూంలతో అవస్థలు...

విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన బాత్‌రూంలు సక్రమంగా లేవు. పాఠశాల బయటి వైపు బాత్‌రూంలు ఉండటంతో వర్షపునీరు నిలిచి, పిచ్చిమొక్కలు పెరిగి ఒకవైపు ఆటంకంగా ఉండటంతో పాటు మరొకచోట ఉన్న వాటికి నీటి సరఫరా చేసే పైపు దెబ్బతినడంతో వాటిని మూసేశారు. దీంతో విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతం.


ఆవరణలో వర్షం నీరు నిలిచిపోయింది



వర్షం వస్తే పాఠశాలలో ఉన్న క్రీడా మైదానమంతా బురదమయంగా మారి వర్షపునీరు నిలిచి ఉంటుంది. దీంతో వర్షం వచ్చిన ప్రతి సారి రోజుల తరబడి నీరు నిలిచి ఆటలకు ఇబ్బందిగా మారుతుంది. ఇక బాత్‌రూంలకు వెళ్లాలంటే భయం వేస్తుంది. కొన్నింటికి నీటి సరఫరా లేక మూసేశారు. మిగిలిన వాటికి వెళ్లే దారిలో నీరు నిలిచి, పిచ్చి మొక్కలు పె రిగిపోయాయి. దీంతో వెళ్లేందుకు జంకుతున్నాం.

– ఉమామహేశ్వరి, విద్యార్థిని

వసతులు లేక ఇబ్బంది పడుతున్నాం



పాఠశాలలో భోజన చేయడానికి కూడా సరైన వసతులు లేవు. ఎక్కడ పడితే అక్కడ కూర్చొని తింటున్నాం. ఇక మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. పిచ్చిమొక్కలు పెరిగి ఆవరణమంతా మురుగునీరు ఉండటంతో మైదానంలోకి వెళ్లేందుకువీలు కాని పరిస్థితి. పిచ్చిమొక్కల్లో విష పురుగులు సంచరిస్తున్నాయి. భయంతో అటు వెళ్లడం మానేశాం.

– నాగార్జున, విద్యార్థి